క్లుప్తంగా

అన్ని వర్గాలకు మేలు..



సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాలకూ మేలు జరిగిందని, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే ఆయనను మళ్లీ సీఎంగా చేసుకోవాలని పట్టణంలోని పదవ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పెద్దింటి వెంకటేశ్వర్లు (చిట్టి) అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో ఆదివారం ఆయన ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాను గుర్తుపై వేసి, సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా అంబటి రాంబాబును, నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ నెల 25న మంత్రి అంబటి రాంబాబు నామినేషన్ దాఖలు చేస్తున్నారని, వార్డులోని ప్రతి ఒక్కరు తరలి వచ్చి ఆయనను ఆశీర్వదించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పూర్వ వలంటీర్లు.. ప్రచార వాహికలు



సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నరసరావుపేట ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్, సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబుకు మద్దతుగా పట్టణంలోని 26వ వార్డులో పూర్వ వలంటీర్లు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ మంచి చేసే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ప్రజలకు గుండెల్లో ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆయన మళ్లీ అదే స్థానంలో కొనసాగాలంటే ప్రజలందరి ఆశీర్వచనాలు కావాలని విజ్ఞప్తి చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 26వ వార్డు పూర్వ వలంటీర్లు ఉన్నారు.

నామినేషన్ కార్యక్రమానికి తరలిరండి

క్రోసూరు: పెదకూరపాడులో సోమవారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకర రావు నామినేషన్ కార్యక్రమానికి సోమవారం మండలంలోని అన్ని గ్రామాల నుంచి అభిమానులు, నాయకులు, ప్రజాప్రతినిధులు భారీగా తరలిరావాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు వెలది అప్పారావు ఆదివారం తెలిపారు. నామినేషన్ ర్యాలీ 75 త్యాళ్లూరు మీదగా పెదకూరపాడు తహసీల్దారు కార్యాలయం వరకు జరుగుతుందని పేర్కొన్నారు.

టీడీపీ అభ్యర్థిగా బీ ఫాం అందుకున్న కన్నా



సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణకు ఆదివారం ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు బీ ఫాం అందజేశారు. ఉండవల్లిలో బీ ఫాం అందుకున్న కన్నా.. సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు.


7 మద్యం సీసాలు స్వాధీనం



దాచేపల్లి : మండలంలోని పొందుగుల రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ప్రైవేటు ట్రావెల్ బస్సులో అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎ. సురేంద్రబాబు ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ దాసరి శివనాగరాజు పర్యవేక్షణలో చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న ట్రావెల్ బస్సులో వినుకొండ పట్టణానికి చెందిన షేక్ కాలేషావలి వద్ద అక్రమంగా తరలిస్తున్న 7 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు.

ఓటమి భయం.. ప్రలోభాల పర్వం

- బరితెగిస్తున్న తెలుగుదేశం నాయకులు
- వైఎస్సార్ సీపీ నాయకులకు ఎర వేసే ప్రయత్నం
- భారీగా నగదు, పార్టీలో ప్రాధాన్యం ఇస్తామని ఫోన్లు
- జనంలో బలమున్న నేతలకు నగదు ఆఫర్
- ఆకర్షించేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్న వైనం
- తిప్పికొడుతున్న అధికార పార్టీ నేతలు



సత్తెనపల్లిలో టీడీపీ బేరసారాలకు దిగుతోంది. వైఎస్సార్ సీపీ నాయకులు, నేతలను ప్రలోభాలకు గురి చేసి, వారిని కొనుగోలు చేసేందుకు ఆఫర్లు ప్రకటిస్తోంది. కూటమి కట్టినా..ఓటమి భయం వీడక పోవడంతో నగదు ఎర చూపుతోంది. ప్రలోభాలకు లొంగని వైఎస్సార్ సీపీ నేతలు, నాయకులు దీటుగా సమాధానం చెబుతుండదంతో.. మిన్నకుండిపోతున్నారు.

సత్తెనపల్లి: ప్రజాబలం ఉన్న సత్తెనపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని ఢీ కొట్టేందుకు కూటమి నేతలు కుయుక్తులు పన్నుతున్నారు. తమ మేనిఫెస్టోలోని పథకాలను ఓటర్లు పట్టించుకోవడం లేదన్న విషయాన్ని గ్రహించిన తెలుగుదేశం పార్టీ నేతలు ప్రలోభాలకు తెరతీశారు. నియోజకవర్గంలో ఎంచుకున్న గ్రామాలు, సత్తెనపల్లి పట్టణంలో వార్డుల్లో సామాజిక వర్గాల వారీగా వైఎస్సార్ సీపీ నాయకులకు ఫోన్లు చేసి, నగదు ఆశ చూపిస్తున్నారు. పెత్తనం మొత్తం మీదేనంటూ నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారు. అయితే వైఎస్సార్ సీపీ నాయకులు మాత్రం టీడీపీ ఆకర్షణలకు లొంగకుండా దీటుగా సమాధానం చెబుతున్నారు.

కౌన్సిలర్‌కు రూ.5 లక్షల ఆఫర్..

సత్తెనపల్లి మున్సిపాలిటీలోని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లకు టీడీపీ నగదు నజరాను ప్రకటిస్తోంది. జనంలో ఉన్న బలం ఆధారంగా ఒక్కో కౌన్సిలర్‌కు రూ.5 లక్షలు రేటు ఫిక్స్ చేయగా.. బలం లేని వారికి కొంత తగ్గించినట్లు సమాచారం. ఇటీవల చాలా మందికి ఫోన్లు చేసినా ఎవరూ స్పందించక పోవడంతో టీడీపీ నేతల్లో ఒకింత అసహనం పెరిగిపోయింది.

ముమ్మాటికి ఎన్నికల నియమావళి ఉల్లంఘనే..

నాయకులు, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం ముమ్మాటికి ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పట్టణంలోని ఓ కాంట్రాక్టర్ నాగేశ్వరరావు ఇంటిని స్థావరంగా చేసుకొని నగదు పంపిణీ కూడా జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఓట్లు అడిగితే తప్పు లేదని, ప్రలోభాల గురిచేసి, నగదు ఇవ్వజూపే వ్యక్తులపై ఎన్నికల అధికారులు దృష్టి సారించి, చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పి.అనిల్‌కుమార్ యాదవ్‌కు రూ.10లక్షల ఆఫర్

సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ పట్టణంలోని పి.అనిల్‌కుమార్ యాదవ్ అనే వ్యక్తికి ఫోన్ చేసి 'రూ.10 లక్షలు తీసుకో.. నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేసి వెళ్లిపో... ఎన్నికలు అయిపోయిన తర్వాత తిరిగిరా..' అని కోరినట్లు నియోజకవర్గంలో విస్తతంగా ప్రచారం జరుగుతోంది. నరసరావుపేట వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ గెలుపుపై ప్రభావం చూపేందుకు ఈ వ్యవహారం నడుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఒప్పందాన్ని సదరు పి.అనిల్‌కుమార్‌యాదవ్ అనే వ్యక్తి కూడా తిరస్కరించినట్లు తెలిసింది.

సత్తెనపల్లి గడ్డ ఎత్తిన సత్తెన్న

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఘనంగా సత్తెన్న విగ్రహావిష్కరణ వార్షికోత్సవం
- వడియరాజుల సంఘం ఆధ్వర్యంలో అన్నసంతర్పణ



సత్తెన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్, అంబటి రాంబాబు

సత్తెనపల్లి: పల్నాడు ముఖ ద్వారమైన సత్తెనపల్లి గడ్డ ఎత్తింది వడియరాజు వంశీకుడు సత్తెన్న అని, వడియరాజులకు ఆత్మగౌరవాన్ని కల్పించామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెన్న చరిత్ర గుర్తుంచుకునేలా పట్టణ నడిబొడ్డున ఆయన విగ్రహాన్ని మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆదివారం వడియరాజుల సంఘం పట్టణ అధ్యక్షుడు వేముల వరప్రసాదరావు ఆధ్వర్యంలో సత్తెన్న విగ్రహావిష్కరణ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్, మంత్రి అంబటి రాంబాబు సత్తెన్న విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి రాంబాబు సత్తెన్న చరిత్రను, విగ్రహావిష్కరణ ప్రాముఖ్యతను అనిల్‌కుమార్ యాదవ్‌కు వివరించారు. వైఎస్సార్ సీపీకి వడియరాజులు అండగా ఉంటున్నారన్నారు. ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు జగనన్నకు అండగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. చరిత్రలో ఎవరూ అవకాశాలు కల్పించని స్థాయిలో జగనన్న బడుగులకు రాజకీయ ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వడియ రాజుల సంఘ నియోజకవర్గ, పట్టణ, మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రతిష్టోత్సవం



పూజలు అనంతరం సత్కారం అందుకున్న అనిల్‌కుమార్‌యాదవ్, అంబటి రాంబాబు

సత్తెనపల్లి: మండల పరిధిలోని బృగుబండ గ్రామంలో శ్రీ సుభద్ర బలరామ సమేత జగన్నాథ స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి రాంబాబు, నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థి అనిల్ కుమార్‌యాదవ్ పాల్గొని, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అతిథులను పూర్ణకుంభంతో ఆహ్వానించి, సాదర స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆశీస్సులు అందించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని నేతలు వేడుకొన్నారు. ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వం మళ్లీ కొనసాగాలని వారు ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక నాయకులు అంబటి రాంబాబు, అనిల్‌కుమార్ యాదవ్‌ను ఘనంగా సత్కరించి, సన్మానించారు. గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయ భాస్కరరెడ్డి, నాయకులు ఉన్నారు.

- **అభివృద్ధి చేశాం... అదరించండి**



మండలంలోని లగడపాడు గ్రామంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి, సంక్షేమ ఫలాలు అందించామని ప్రజలకు చెప్పారు. పెదకూరపాడు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. –పెదకూరపాడు

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో మే 13న నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల ఎన్నికల నియమ నిబంధనల పర్యవేక్షణ అధికారి కె. పాపయ్య అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని మంచికల్లు గ్రామంలో పర్యటించి ఎన్నికల ప్రవర్తన నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాపయ్య మాట్లాడుతూ తమ బృందం మే 13 సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కూడా మండలంలోని గ్రామాల్లో పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమాళిని పటిష్టంగా అమలు చేయడానికి కృషి చేస్తుందన్నారు. మండల ప్రజలు ఘర్షణలకు దూరంగా ఉండి, ఎన్నికల కోడ్ ఉల్లంఘించకుండా ప్రశాంతంగా వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునే విధంగా చైతన్యవంతులను చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో వాహనాల్లో భారీగా నగదు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తరలించడం నేరమని గుర్తుంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతుంటే వెంటనే భారత ఎన్నికల సంఘం నూతనంగా ఏర్పాటు చేసిన సి-విజిల్ యాప్ ద్వారా సమాచారం ఇవ్వాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం క్షేత్రస్థాయిలో స్పందించి చర్యలు చేపడుతుందన్నారు.

ప్రతి అంశాన్ని సూక్ష్మ పరిశీలన చేయాలి

సత్తెనపల్లి నియోజకవర్గ ఆర్వో మురళీకృష్ణ



పట్టణంలో మైక్రో అబ్జర్వర్ల శిక్షణలో మాట్లాడుతున్న ఆర్వో మురళీకృష్ణ

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని సూక్ష్మ పరిశీలన చేయాలని సత్తెనపల్లి నియోజకవర్గ ఆర్వో వి.మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పోలింగ్ ప్రక్రియ, మాక్ పోలింగ్, ఓటర్లకు స్లిప్పుల పంపిణీ తదితర అంశాలను సూక్ష్మంగా పరిశీలన చేయాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి అవగాహన కల్పించారు. అలాగే ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌లను వినియోగించుకోవాలని, దీనికి సంబంధించి ఫారం-12 అందించాలన్నారు. శిక్షణలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, తహసీల్దార్లు సీహెచ్ ఉష (సత్తెనపల్లి), సి.శింగారావు(ముప్పాళ్ళ), పి.లక్ష్మీనరసింహం (రాజుపాలెం), ఎల్.లక్ష్మీనారాయణ(నకరికల్లు), అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్ రవిచంద్ర, 108 మంది మైక్రో అబ్జర్వర్లకు గాను 98 మంది హాజరయ్యారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు



5వ వార్డులో ఎన్నికల ప్రచారంలో అంబటి విజయలక్ష్మి



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న మంత్రి అంబటి తనయ మనోజ్ఞ

మంత్రి అంబటి సతీమణి, తనయ ఎన్నికల ప్రచారం

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందాయని మంత్రి అంబటి రాంబాబు సతీమణి అంబటి విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని 5వ వార్డులో ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ఇంటింటికి పర్యటించారు. గత టీడీపీ ప్రభుత్వానికి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గమనించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబును, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి.అనిల్ కుమార్ యాదవ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా 5వ వార్డులో మహిళలు అడుగడుగున పూలు చల్లుతూ అంబటి విజయలక్ష్మికి ఘన స్వాగతం పలికి, హారతులు పట్టారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీత హాసంతి, 5వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ సయ్యద్ సలీం, నాయకులు దేవరశెట్టి రవికుమార్ పాల్గొన్నారు.

మంత్రి తనయ ఎన్నికల ప్రచారం

రాజుపాలెం: మంత్రి అంబటి రాంబాబు తనయ డాక్టర్ అంబటి మనోజ్ఞ మండలంలోని దేవరంపాడులో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు మనోజ్ఞకు హారతులు పట్టారు. గ్రామంలో గత ఐదేళ్లలో రూ.19.79 కోట్లతో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ పత్తిపాటి దీనమ్మ కోటేశ్వరరావు నాయకులు ఆమె వెంట ఉన్నారు.

గల్లంతైన ఇద్దరి బాలుర మృతదేహాలు లభ్యం

దుర్గి: నిండునూరేళ్ళు జీవించాల్సిన ఆ చిన్నారుల జీవితం అర్ధాంతరంగా ముగిసింది. రెండు కుటుంబాల్లో తీవ్ర దుఃఖాన్ని నింపిన విషాద ఘటన పలువురుని కంటతడి పెట్టించింది. సోహెల్ పుట్టినరోజు వేడుకలకు గుంటూరు నుంచి యూసుఫ్‌తో కలిసి సోహెల్ తల్లి మస్తాన్ బి నివసిస్తున్న అడిగొప్పలకు వచ్చారు. ఇద్దరూ మృత్యువులోనూ స్నేహాన్ని వీడలేదు. పదో తరగతి పరీక్షలు రాసి ఫలితాలు కోసం ఎదురుచూస్తూ గొప్ప చదువులు చదివి తల్లిదండ్రులకు తోడుగా నిలవాల్సిన ఆ చిన్నారుల జీవితం విషాదంగా ముగిసింది. అడిగొప్పల కుడికాలువ వద్ద శనివారం సాయంత్రం గల్లంతైన సోహెల్ (16) యూసుఫ్ (16) మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన మృతదేహాల కోసం పోలీసులు, రెవిన్యూ యంత్రాంగం రాత్రంతా గాలించగా ఆదివారం వైకుంఠపురం కాలువ వద్ద మృతదేహాలు లభ్యమయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. తల్లిదండ్రుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ రజనీకుమారి సందర్శించారు. బాలురి ఆచూకీ లభ్యమయ్యే వరకు పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తూ పర్యవేక్షించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్ కోటయ్య తెలిపారు.

సొంత గూటికి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు



పార్టీలో చేరిన వారితో నంబూరు కల్యాణ్ చక్రవర్తి



వైఎస్సార్ సీపీలో చేరిన అమరావతి టీడీపీ నాయకులు

పెదకూరపాడు: ఇటీవల టీడీపీలో చేరిన పెదకూరపాడు గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు మళ్లీ సొంత గూటికి చేరారు. వారికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తనయుడు నంబూరు కల్యాణ్ చక్రవర్తి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ నాయకులు మభ్యపెట్టి పార్టీలో చేర్పించుకున్నారని వారు తెలిపారు. సిలార్ బుడే, అక్రమ్, జానీ, ఇస్మాయిల్, సలామ్ భాష తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

అమరావతి: మండల కేంద్రమైన అమరావతిలోని విజయసాగర్ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు నంబూరు బాబురావు, నిమ్మా విజయసాగర్‌బాబు బుడగ జంగాలు, కాపు సామాజిక వర్గానికి చెందిన ఇరవై మందిని వైఎస్సార్ సీపీలోకి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

వైఎస్సార్ సీపీలోకి ఊపందుకున్న చేరికలు



పార్టీలో చేరిన వారిని ఆహ్వానించిన మంత్రి అంబటి రాంబాబు

పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే కుమారుడు వెంకటేశ్వరరావు

రాజుపాలెం: ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్ది వైఎస్సార్ సీపీలోకి చేరికలు ఊపందుకుంటున్నాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పెరుగుతున్న నమ్మకంతోనే ఇది సాధ్యమవుతుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని ఉప్పలపాడులో జనసేన నుంచి పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరావు కుమారుడు అల్లంశెట్టి వెంకటేశ్వరరావు, పూలం వెంకటేశ్వరరావు, మరో ముగ్గురు కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు వారిని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు లాయర్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతలలో చోరీ

రెంటచింతల : స్థానిక వ్యవసాయ కార్యాలయం సమీపంలో శనివారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. గుండా రమేష్ అనే వ్యక్తి కుటుంబంతో కలిసి ఈ నెల 18న తిరుపతికి వెళ్లి ఆదివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు, బీరువా పగలగొట్టినట్లు గమనించారు. బీరువాలోని రూ. 85 వేల నగదు, సుమారు 550 గ్రాముల విలువైన వెండి వస్తువులు చోరీకి గురైనట్లు తెలిపారు. పోలీసులు ఘటన ఇంటికి వెళ్లి పరిశీలించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



నాదెండ్ల: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని చిలకలూరిపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి నారదముని కోరారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మైక్రో అబ్జర్వర్లకు పోలింగ్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు గుర్తించిన సమస్యాత్మక కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్లు వంద మీటర్ల దూరంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకున్నా పీఓలతో పాటూ నివేదిక సమర్పించాలని కోరారు. కేటాయించిన కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు అంశాలపై శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వరకుమార్, జ్వాలా నరసింహం, అశ్రిపున్నిసా పాల్గొన్నారు.

అన్నవరంలో రెండు పూరిళ్లు దగ్ధం



రొంపిచర్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధమైన ఘటన మండలంలో అన్నవరంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రూ.7 లక్షల రూపాయల మేర ఆస్తి బుగ్గిపాలైంది. వివరాలు.. గ్రామంలోని దళితవాడలో నివాసముంటున్న పోలెపోగు పిచ్చయ్య, అతడి కుమారుడు జాన్‌లకు చెందిన రెండు పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాద సమయంలో గ్యాస్ సిలిండర్లు పేలడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో కాలనీవాసులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. ఘటన సమయంలో ఇళ్లల్లో ఎవరూ లేరు. నరసరావుపేట అగ్ని మాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. రెండు ఇళ్లలో రూ.1.50 లక్షల నగదు, 5 సవర్ల బంగారంతో పాటు వస్తువులు కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.